# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 07-04-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. సార్వత్రిక ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు.**

**2. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుండి ఈనెల రెండో తేదీ వరకు ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా లక్షా 26 వేల 549 మంది ఓటర్లు నమోదైనట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం ప్రకటించింది.**

**3. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర ప్రకాశం జిల్లాకు చేరుకుంది.**

**4. హైదరాబాద్‌లోని తుక్కుగూడలో ఏర్పాటుచేసిన జన జాతర సభలో న్యాయ పత్రం పేరుతో కాంగ్రెస్ పార్టీ జాతీయస్థాయి మేనిఫెస్టోను విడుదల చేసింది.**

**5. తెలంగాణలోని అన్ని గ్రామీణ ప్రాంతాల్లో తాగు నీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నామని పంచాయత్ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ తెలిపారు.**

==========================

సార్వత్రిక ఎన్నికలను శాంతియుతంగా, స్వేచ్ఛగా నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీలను ఆదేశించారు. గుంటూరు జిల్లా వెలగపూడి సచివాలయం నుండి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, పోలీస్ సూపరింటెండెంట్లు, పోలీస్ కమిషనర్లతో నిన్న దృశ్య మాధ్యమం ద్వారా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఎన్నికల కోసం చేపట్టిన ఏర్పాట్లు, తీసుకుంటున్న చర్యలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు వంటి అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇంటింటి ప్రచారానికై ముందస్తుగా పొందాల్సిన అనుమతి విషయంలో భారత ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలు పంపామని, ఈ అంశంలో తగిన వివరణ అందేలోపు ఇంటింటి ప్రచారానికి సంబంధించి ముందస్తు సమాచారాన్ని సంబంధిత అధికారులకు ఇవ్వాలని, అన్ని రాజకీయ పార్టీలకు తెలియజేయాలని సూచించారు. ఎన్నికల్లో ఎటువంటి హింసకు తావులేకుండా పటిష్టమైన భద్రతా చర్యలను చేపట్టాలన్నారు. అక్రమ రవాణాలపై దృష్టి సారించాలని, రాష్ట్రాల సరిహద్దులు, జిల్లాల సరిహద్దుల్లో ఉండే చెక్‌పోస్టలలో నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ముఖేష్‌కుమార్ మీనా సూచించారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల షెడ్యూల్ విడుదల అయినప్పటి నుంచి ఏప్రిల్ రెండో తేదీ నాటికి ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా లక్షా 26 వేల 549 మంది ఓటర్లుగా నమోదయ్యారని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం ప్రకటించింది. షెడ్యూల్ ప్రకటించిన రోజుకి రాష్ట్రంలో మహిళా ఓటర్ల సంఖ్య 2 కోట్ల 8 లక్షల 49 వేల 730గా ఉంటే ఏప్రిల్ 2 నాటికి 2 కోట్ల 9 లక్షల 16 వేల 389కి పెరిగిందని తెలిపింది. పురుష ఓటర్ల సంఖ్య 2 కోట్ల 84 వేల 276 నుంచి 2 కోట్ల ఒక లక్షా 44 వేల 166కు పెరిగినట్లు పేర్కొంది. నామినేషన్ల దాఖలు చివరిరోజు వరకు కొత్త ఓటర్లను చేర్చుకొనే అవకాశం ఉండటంతో ఈ సంఖ్య మరింత పెరుగుతుందని ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు. కొత్త ఓటర్ల నమోదుకు ఎన్నికల సంఘం అధికారులు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఓటరు అవగాహన కార్యక్రమం సత్ఫలితాలను అందిస్తోందని, దీంతో ఈసారి ఎక్కువ సంఖ్యలో యువ ఓటర్లు నమోదవుతున్నారని అధికారులు వెల్లడించారు.

---------------------------

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర ప్రకాశం జిల్లా చేరుకుంది. ఈ యాత్రలో భాగంగా ఆయన ఈఉదయం జువ్విగుంట క్రాస్ నుంచి బయలుదేరుతారు. అలవలపాడు, కనిగిరి మీదుగా పెద్ద అరికట్ల చేరుకుంటారు. అనంతరం చిన్న అరికట్ల, మూగచింతల మీదుగా కొనకనమెట్ల క్రాస్ వద్దకు చేరుకుంటారు. అక్కడ బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. అనంతరం బత్తువారిపల్లి, సలక నూతల క్రాస్, పొదిలి, రాజంపల్లి, దర్శి మీదుగా వెంకటాచలం పల్లి వద్ద ఈరోజు రాత్రి బస చేస్తారని వైఎస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం తెలిపారు.

కాగా నిన్న మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి బహిరంగ సభలో జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో పాఠశాలలను, ఆస్పత్రులకు సైతం మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేశామని అన్నారు. గత ఐదేళ్లుగా అవినీతి, వివక్ష లేని వ్యవస్థ తీసుకొచ్చామని తెలిపారు.

---------------------------

ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తెలంగాణలో అమలు చేసినట్లుగానే..జాతీయస్థాయిలోనూ అమలు చేస్తామని ఆ పార్టీ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ అన్నారు. హైదరాబాద్‌లోని తుక్కుగూడలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ జనజాతర సభలో న్యాయపత్రం పేరుతో కాంగ్రెస్ రూపొందించిన జాతీయస్థాయి మేనిఫెస్టోను రాహుల్ గాంధీ తెలంగాణ కాంగ్రెస్ నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ మేనిఫెస్టోలో రైతులు, మహిళలు, యువత వంటి అన్నివర్గాల అభివృద్ధే లక్ష్యంగా 5 గ్యారంటీలు రూపొందించడం జరిగిందని తెలిపారు. అనంతరం తెలంగాణ కాంగ్రెస్ నాయకులు ఏ.రేవంత్ రెడ్డి మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమిని గెలిపించాలని పిలుపునిచ్చారు.

---------------------------

ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా వేసవిలో నీటి సరఫరా చాలా కీలకమని, తెలంగాణలోని అన్ని గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి తాగునీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలంగాణ పంచాయత్ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా చెప్పారు. మిషన్ భగీరథ నీటి సరఫరా నిర్వహణపై ఆయన నిన్న సమీక్షా సమావేశం నిర్వహించారు. అన్ని పంపు సెట్ల మరమ్మతులను ఏప్రిల్ 12 నాటికి పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. నీటి ఎద్దడి ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతాల్లో చర్యలు చేపట్టేలా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు.

---------------------------

తెలంగాణ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అధిక స్థానాల్లో విజయం సాధిస్తుందని రాష్ట్ర భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు జి.కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో నిన్న నిర్వహించిన బీజేపీ 44వ ఆవిర్భావ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 1980 ఏప్రిల్ 6న అటల్ బిహారీ వాజ్‌పేయి లాల్ కృష్ణ అద్వానీ గారి నేతృత్వంలో ఏర్పడిన బీజేపీ ఇప్పుడు దేశంలో అతి పెద్ద జాతీయ పార్టీగా అవతరించిందని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో తొమ్మిదిన్నరేళ్లుగా ప్రతి కార్యకర్త సంతోషంగా, ఆత్మవిశ్వాసంతో పనిచేస్తున్నారని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

---------------------------

లోక్‌సభ ఎన్నికలకు భారత రాష్ట్ర సమితి– బిఆర్ఎస్ పలు పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలో అసెంబ్లీ స్థానాల వారీగా ఎన్నికల సమన్వయకర్తలను నియమించింది. మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో 7 స్థానాలకు, చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో 7 స్థానాలకు సమన్వయకర్తలను నియమిస్తున్నట్లు ఆ పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది.

---------------------------

ఈనెల 9న ఉగాదిని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం వేల్పూరు పంచాయతీ పరిధి శివారు గ్రామమైన గంటావారిపాలెంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.యస్.జగన్మోహన్ రెడ్డి సతీసమేతంగా ఉగాది పండుగను జరుపుకుంటారని ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి. గత రాత్రి గంటావారిపాలెం వద్ద జగన్మోహన్ రెడ్డి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను ఆ పార్టీ నాయకులు పర్యవేక్షించారు. " మేమంతా సిద్ధం " బస్సు యాత్ర కార్యక్రమంలో భాగంగా వినుకొండలో సమావేశం అనంతరం.. విఠంరాజుపల్లి, శావల్యాపురం మీదుగా గంటావారిపాలెం వద్ద బస చేస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా టిడిపి, జనసేన, బిజెపి కూటమిగా ఏర్పడిందని తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు తెలిపారు. పల్నాడు జిల్లా క్రోసూరులో నిర్వహించిన ప్రజాగళం బహిరంగసభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి కోసం భారతీయ జనతా పార్టీతో పొత్తు కలిశామని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని నీటి ప్రాజెక్టులు పూర్తి కావాలంటే కూటమి అధికారంలోకి రావాలని తెలిపారు.

---------------------------

దేశంలో రానున్న రోజుల్లో పూర్తిస్థాయిలో వేగవంతమైన అభివృద్ధిని చేపడతామని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు నరేంద్రమోదీ తెలిపారు. రాజస్థాన్‌లోని పుష్కర్‌లో నిన్న జరిగిన బహిరంగసభను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. మూడవసారి ప్రభుత్వం ఏర్పాటు చేసిన తొలి వంద రోజుల్లోనే అవినీతి నిర్మూలనకు చర్యలు చేపడతామని తెలిపారు. రాజస్థాన్ రాష్ట్రంలోని వీరమాతల వల్ల వీరసైనికులు తయారై దేశసేవలో నిమగ్నమయ్యారని ప్రశంసించారు. నేడు దేశంలోని మహిళలు డ్రోన్లను నడుపుతూ, ఇస్రో వంటి అత్యున్నత సంస్థల్లో ప్రాజెక్టులు చేపడుతున్నారని అన్నారు

---------------------------

తెలంగాణ ఛత్తీస్‌ఘఢ్ సరిహద్దు ప్రాంతంలో నిన్న జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు నక్సలైట్లు మరణించారు. ఛత్తీస్‌ఘఢ్‌లోని బీజాపూర్ జిల్లా ములుగు సరిహద్దు అటవీ ప్రాంతంలో భద్రత దళాలతో కాల్పులు జరిగినట్లు పోలీసులు తెలియజేశారు. తెలంగాణలో గ్రేహౌండ్స్ సిబ్బంది అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపడుతుండగా ఎదురు కాల్పులు జరగడంతో ఈ ఘటనలో ముగ్గురు నక్సలైట్లు మరణించారని, మృతుల్లో ఒకరు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని అంకుశపూర్ గ్రామానికి చెందినవారిగా గుర్తించినట్లు పోలీసులు వెల్లడించారు.

=====================